క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వెంకన్న సన్నిధిలో సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: పట్టణంలోని మార్కెట్ వీధిలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తాపీ మేస్త్రుల సంఘం ఆధ్వర్యంలో ఈ కల్యాణం జరిగింది. ఉదయం స్వామివారికి, అమ్మవారికి కుంకుమార్చన, పంచామృత అభిషేకాలు జరిపించారు. రాత్రి పెంటపాటి గణేశ్వరరావు, వీరవెంకట సత్యవల్లి దంపతులతో దివ్య కల్యాణాన్ని వేద పండితులు జరిపించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నేతలు తొగరు మూర్తి, బండారు వెంకటరమణ, శీలం గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు రెండు సెట్ల నామినేషన్లు

రామచంద్రపురం: రెండో రోజైన శుక్రవారం రెండు సెట్ల నామినేషన్లు దాఖలైనట్టు రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఎస్ సుధాసాగర్ తెలిపారు. బహుజన సమాజ్‌వాదీ పార్టీ నుంచి మాతా సుబ్రహ్మణ్యం ఒక సెట్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి జుత్తుక వెంకట్రావు ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేసినట్టు ఆర్‌ఓ చెప్పారు. రెండు రోజుల్లో మొత్తం ఏడు సెట్ల నామినేషన్లు దాఖలైనట్టు వివరించారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులకు ఎన్నికల నియమావళి కిట్లను అందించారు.

రెండు నామినేషన్ల దాఖలు

మండపేట: ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు రెండో రోజైన శుక్రవారం మండపేట అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక ఎన్నికల అధికారి కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థిగా మందపల్లి రవికుమార్ ఒక నామినేషన్‌ను దాఖలు చేయగా, నవతరం పార్టీ అభ్యర్థి నందికోళ్ల రాజు మరో సెట్టు నామినేషన్‌ను ఎన్నికల అధికారి ఎల్లారావుకు సమర్పించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

రాయవరం: పసలపూడి గ్రామ సమీపంలో చెల్లూరు వంతెన వద్ద కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు మల్లిడి సుబ్బారెడ్డి, వరలక్ష్మి ఆధ్వర్యంలో అర్చకులు సుబ్రహ్మణ్యేశ్వర శర్మ బృందం కల్యాణాన్ని జరిపించారు. చింతా వేణుగోపాలరెడ్డి-మాధవి, సత్తి ఆదినారాయణ రెడ్డి-విజయదుర్గ, పోతంశెట్టి సుబ్బారెడ్డి-విమల, కర్రి శ్రీనివాసరెడ్డి- శ్రీలక్ష్మి, నక్క రామకృష్ణ-వీరవేణి దంపతులు పీటలపై కూర్చుని, కల్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం భారీగా అన్న సమారాధన జరిగింది.

భీమేశ్వరాలయంలో పంచాయతన మహాయజ్ఞం



పంచాయతన మహాయజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని హోమశాలలో శుక్రవారం పంచాయతన మహాయజ్ఞం నిర్వహించారు. యజ్ఞకర్తలు మంచెం ఆంజనేయమూర్తి, వెంకట సత్యరమ దంపతుల ఆధ్వర్యంలో పంచాయతన దేవతలైన గణపతికి ప్రీతిగా లక్ష్మీగణపతి జపం, లక్ష్మీ గణపతి హోమం, విష్ణు ప్రీతిగా సుదర్శన హోమం, సుదర్శన పారాయణం, చండీ అమ్మవారికి ప్రీతిగా శత చండీ యాగం, రుద్రాభిషేకం, రుద్ర హోమాలు, ఉదయం సూర్యనారాయణ ప్రీతిగా సూర్యనమస్కారాలు, మధ్యాహ్నం సౌర హోమాలు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. 25 మంది వేద పండితులు ఈ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న ఆశయంతో మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్టు యజ్ఞకర్తలు తెలిపారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట సాగుతో భూసారం వృద్ధి

కాజులూరు: డెల్టాలోని పంట భూముల్లో రైతులు రబీ సాగు అనంతరం మూడో పంటగా పచ్చి రొట్ట ఎరువుల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. పచ్చి రొట్ట ఎరువుల సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని చెప్పారు. శుక్రవారం కాజులూరులో ఆయన రైతులతో మాట్లాడారు. డెల్టాలో కొందరు రైతులు దాళ్వా సాగు అనంతరం అపరాల సాగు చేపట్టగా, కొందరు రైతులు దాళ్వా మాసూళ్ల ఆలస్యం కావటంతో పొలాలను ఖాళీగానే వదిలేస్తున్నారన్నారు. పెసర, మినుము వంటి అపరాల సాగుకు అవకాశం లేని పొలాల్లో రైతులు జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చి రొట్ట ఎరువుల సాగు చేపడితే భూసారం పెరుగుతుందన్నారు. ఈ సాగు వల్ల రైజోబ్యూమ్ అనే బ్యాక్టీరియా వృద్ధి చెంది, భూసారం పెరుగుతుందని, పచ్చి రొట్ట మొక్క వేళ్ల నుంచి నత్రజని భూమిలో చేరుతుందని వివరించారు. తదుపరి వరి సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ప్రముఖులు

కపిలేశ్వరపురం / మండపేట: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండపేట నియోజకవర్గానికి చెందిన ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా తేతలి, శుక్రవారం కాకినాడలోనూ వీరు కలిశారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షుడు చోడే సత్యకృష్ణ, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి చోడే శ్రీకృష్ణ, యువ నాయకుడు చిర్ల జయరామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సీఎం జగన్‌తో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన, నేతలు పట్టాభి, రాధాకృష్ణ, సత్యకృష్ణ, శ్రీకృష్ణ



సీఎం జగన్‌తో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు



సీఎం జగన్‌తో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు



సీఎం జగన్‌తో యువ నాయకుడు చిర్ల జయరామ్‌రెడ్డి

అభివృద్ధికి కేరాఫ్ అర్తమూరు

- ఐదేళ్లలో గణనీయంగా గ్రామాభివృద్ధి
- 32,162 మందికి సంక్షేమ ఫలాలు
- సంక్షేమానికి రూ.84.85 కోట్లు
- ప్రగతికి రూ.5.53 కోట్లు ఖర్చు
- వైఎస్ జగన్ పాలనలోనే సాధ్యమైందంటున్న ప్రజాప్రతినిధులు



అర్తమూరు సచివాలయం



అర్తమూరులో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్

కపిలేశ్వరపురం: ఆధ్యాత్మికతకు ఆలవాలం అర్తమూరు గ్రామం. పచ్చటి పొలాలతో ప్రశాంత జీవనానికి పెట్టింది పేరు అర్తమూరు. అనేక ప్రత్యేకతలున్న అర్తమూరు గ్రామం గత ఐదేళ్లలో గతమెన్నడూ లేనంతగా అభివృద్ధి చెందింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామానికి కొత్త శోభ సంతరించుకుంది. కొత్త ప్రభుత్వ భవనాలు సమకూరాయి. రహదారుల నిర్మాణాలు జరిగాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి సమకూరింది. ఐదేళ్లలో జరిగిన గ్రామాభివృద్ధిపై ఈ కథనం.

ఐదేళ్లలో అభివృద్ధి ఇలా..

గ్రామంలో గత ఐదేళ్లలో రూ.5.54 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఈ స్థాయిలో అభివృద్ధి జరగలేదని గ్రామస్తులు చెబుతున్నారు. మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, గ్రామంలోనే రెండు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారని, వాటికి నూతన భవనాలను సమకూర్చారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రహదారుల నిర్మాణాలు, పారిశుధ్య నిర్వహణ ఇలా అనేక విధాలుగా గ్రామాన్ని అభివృద్ధి చేసినట్టు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ పేర్కొన్నారు. గ్రామాభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎంపీటీసీ మండా సుమలత అన్నారు.

సంక్షేమం ఇలా..

గ్రామంలో గత ఐదేళ్లలో రూ.84.86 కోట్ల విలువైన సంక్షేమ లబ్ధిని పేద, మధ్య తరగతి గ్రామ ప్రజలకు ప్రభుత్వం సమకూర్చింది. వయో భారంతో బాధపడుతున్న అవ్వాతాతలకు ప్రభుత్వం ఆసరాగా నిలిచింది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఏ ఒక్క నెలా ఆపకుండా, క్రమం తప్పకుండా పింఛనును అందజేశారు. వివిధ సామాజిక వర్గాలు, వృత్తులు, విద్యార్థులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా నిలిచింది.

గ్రామ ముఖచిత్రం..

జనాభా	7,000
ఓటర్లు	5,300
సచివాలయాలు	2
వార్డులు	14
ఆర్థిక వనరులు :	1,300 ఎకరాలు - వ్యవసాయం
అత్యధిక ప్రజల వృత్తి :	రైతులు, వ్యవసాయ కూలీలు

సమర్థ పాలనతోనే గ్రామాభివృద్ధి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించడంతో అర్తమూరులోని సామాన్య ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయి. రహదారులు మెరుగుపడ్డాయి. ప్రభుత్వ భవనాలు సమకూరాయి. బడులు బాగుపడ్డాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామాన్ని అభివృద్ధి చేశామన్న సంతృప్తి కలిగింది.

– గొలుగూరి అన్నపూర్ణ, సర్పంచ్, అర్తమూరు

అభివృద్ధి పనులు కొన్ని ఇలా..

అభివృద్ధి పని	నిధులు సమకూరినది	ఖర్చుచేసిన మొత్తం(రూ.ల్లో)
హెల్త్ క్లినిక్	ఎంఎస్ఆర్‌జీఎస్	27,50,000
సచివాలయం-2	45,00,000	
గణపతినగర్ రోడ్డు	మండల పరిషత్	11,90,000
మెయిన్ డ్రెయిన్	మండల పరిషత్	15,60,000
ముత్యాలమ్మ గుడి రోడ్డు	మండల పరిషత్	8,00,000
ఎస్సీ బరియల్ గ్రౌండ్ అభివృద్ధి	మండల పరిషత్	6,00,000
కొవ్వూరివారి వీధి రోడ్డు	మండల పరిషత్	2,25,000
తాపేశ్వరం-రామవరం బీటీ రోడ్డు	ఆర్అండ్‌బీ	1,05,00,000
పశువుల రేవుల నిర్మాణం	పంచాయతీ	7,00,000
సాధారణ సామాజిక భవనం	పంచాయతీ	5,00,000
మెయిన్ డ్రైన్	పంచాయతీ	9,60,000
హైస్కూల్ అభివృద్ధి	నాడు-నేడు	43,00,000
ఎస్సీపేటలో మూడు రోడ్లు	ఎంఎస్ఆర్ఈజీఎస్	10,00,000
పెద్దనుయ్యి సెంటర్‌రోడ్డు	పంచాయతీ	2,00,000
రోడ్లు, డ్రైన్ల నిర్మాణం	ఎంఎస్ఆర్ఈజీఎస్, 14వ ఆర్థిక సంఘం	1,07,00,000
2019-2021 పాఠశాలల అభివృద్ధి	నాడు నేడు	12,06,672
గణపతినగర్ ప్రాథమిక పాఠశాల	--	7,00,000
ఎస్సీ పేట ప్రాథమిక పాఠశాల	--	4,00,000
పుంత రోడ్లు	--	20,00,000
ప్రహరీ, మరుగుదొడ్లు, హ్యాండ్‌వాష్	ఐటీసీ, పంచాయతీ	7,50,000

అర్తమూరులో పేదలకు అందిన ప్రభుత్వ లబ్ధి ఇలా..

పథకం	లబ్ధి(రూ.ల్లో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	1,47,51,774
జగనన్న అమ్మఒడి	3,14,68,000
జగనన్న వసతి దీవెన	1,05,50,900
జగనన్న విద్యాదీవెన	34,48,517
విదేశీ విద్యాదీవెన	22,08,536
వైఎస్సార్ రైతు భరోసా	6,24,65,559
వైఎస్సార్ రైతు సున్నా వడ్డీ	21,33,239
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	1,35,51,900
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	81,12,090
వైఎస్సార్ డ్వాక్రా సున్నా వడ్డీ	26,84,300
వైఎస్సార్ చేయూత	91,13,927
వైఎస్సార్ ఆసరా	2,14,83,110
వైఎస్సార్ బీమా క్లెయిమ్	14,96,000
వైఎస్సార్ కాపు నేస్తం	9,59,082
జగనన్న చేదోడు	16,28,733
వైఎస్సార్ వాహన మిత్ర	7,60,000
అర్చకులు, పాస్టర్లు, మౌజన్, ఇమామ్‌లు	25,000
వైఎస్సార్ పంటల బీమా	36,72,451
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	56,81,178
కోవిడ్ సాయం	24,59,000
అగ్రిగోల్డ్	1,40,000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	42,155
వైఎస్సార్ కళ్యాణమస్తు	50,000

జనసేన నేతలు వైఎస్సార్ సీపీలో చేరిక



ఉండమట్ల పాపారావుకు పార్టీ కండువా వేస్తున్న తోట త్రిమూర్తులు

మండపేట: కేశవరంలో జనసేన పార్టీకి చెందిన కీలక నేతలు ఇద్దరు ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన ఉండమట్ల పాపారావు, కూసు సత్తిబాబు శుక్రవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట వారికి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీను, మాజీ ఎంపీటీసీ తుపాకుల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి



గొల్లపాలెం నుంచి సిద్ధం సభకు తరలివెళ్తున్న కార్యకర్తలు, ప్రజలు



జగన్నాయకులపాలెం నుంచి బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో పేదల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని ఎంపీపీ మాత భారతి అన్నారు. కాకినాడలో శుక్రవారం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభకు కాజులూరు మండలంలోని 26 గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా గొల్లపాలెంలో ఆమె మాట్లాడుతూ పాదయాత్రలో పేదల కష్టాలు చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక నవరత్నాల పథకాలను నూరు శాతం అమలు చేసి ఆదుకున్నారన్నారు. ఆయా సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. ఈ పథకాలు నిరంతరం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోమారు వైఎస్సార్ సీపీని గెలిపించి, అధికారంలోకి తీసుకురావాలన్నారు.

కాకినాడకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

రామచంద్రపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడలో శుక్రవారం నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు రామచంద్రపురం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా అనేక వాహనాల్లో బయలుదేరారు.

రైతులకు సౌలభ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు



వెదురుమూడిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బోసుబాబు

కపిలేశ్వరపురం: ఎలాంటి సమస్యలు లేకుండా రైతులకు సౌలభ్యంగా ఉండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. వెదురుమూడి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కేంద్రంలో సిబ్బంది పనితీరును, రికార్డులను తనిఖీ చేశారు. వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు తీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో రిజిస్ట్రేషన్ పద్ధతి, గోనె సంచులను సమకూర్చడంపై అధికారులతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 15,762 ఎకరాల్లో వరిని సాగు చేశారని, 460 ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వం ముందస్తుగా ప్రకటించిన మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రంలో రైతు తన ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. సాధారణ రకం క్వింటా రూ.2,183, ఎ-గ్రేడ్ రకం క్వింటా రూ.2,203గా ధరను నిర్ణయించామన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్, సచివాలయ వ్యవసాయ సహాయకుడు ఎం.చంద్రశేఖర్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీకే ప్రజాదరణ

- పార్టీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరంలో పార్టీ కార్యాలయం ప్రారంభం



కేశవరంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తోట త్రిమూర్తులు

మండపేట: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమైందని, అన్ని వర్గాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారని మండపేట అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కేశవరం గ్రామంలో శుక్రవారం ఆయన పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సోదరులు మొన్న జరిగిన సంఘటనకు కంటతడి పెడుతూ తనను ఆహ్వానిస్తుంటే చలించిపోయాయని చెప్పారు. అర్ధరాత్రయినా వందల సంఖ్యలో ఎస్సీ సోదరులు, అభిమానులు తరలివచ్చి స్వాగతం చెబుతుంటే తన జన్మ తరించిందని పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎవరెన్ని పన్నాగాలు పన్నినా ప్రజల నుంచి, ముఖ్యంగా దళిత సోదరుల నుంచి తనను వేరు చేయలేరని గద్గద స్వరంతో అన్నారు. ఎన్నికల్లో కేశవరం గ్రామం నుంచే అత్యధిక మెజార్టీ రావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, రాష్ట్ర నేత రెడ్డి రాధాకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, ఎంపీటీసీలు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, మాజీ ఎంపీటీసీ తుపాకుల ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీను, సొసైటీ డైరెక్టర్లు చేబ్రోలు పోసుబాబు, చంద్రమళ్ల ఏసయ్య, నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, అల్లంపల్లి కిశోర్, కూసు మునియ్య, పెదపాటి ఉమామహేశ్వరరావు, అద్దంకి రమణ, సలాది శివ, యడ్ల రవి, కొల్లి సుబ్రహ్మణ్యం, విన్నకోట ప్రసాద్, చంద్రమళ్ల లాజర్, రేగులబంద మాధవ, కుందూరి గణేష్, పలుకురి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

నిప్పును నిర్లక్ష్యం చేస్తే ముప్పే

మాక్ డ్రిల్ నిర్వహించిన ఫైర్ సిబ్బంది



రాయవరంలో ఆస్పత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

రాయవరం: నిర్లక్ష్యంగా నిప్పు వదిలేస్తే పెను ముప్పునకు దారితీస్తుందని రామచంద్రపురం అగ్నిమాపక అధికారి ఎస్.నాగేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక చాణక్య ఆస్పత్రి వద్ద రామచంద్రపురం అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు రోగులను ఎలా కాపాడాలో వివరించారు. పై అంతస్తులో చిక్కుకున్న వారిని రెస్క్యూ మెథడ్ ద్వారా కిందకు ఎలా తీసుకురావాలో ప్రయోగాత్మకంగా చూపించారు. అలాగే ఆస్పత్రులు, పరిశ్రమలు, ఇళ్లు, పశువుల కొట్టాలు తదితర ప్రదేశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలన్నారు. ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినప్పుడు మొదట మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన తర్వాత, మంటలను ఆర్పడానికి ప్రయత్నించాలన్నారు. అగ్ని ప్రమాదాల సమయంలో మంటలను అదుపు చేసేందుకు ఉపయోగించే సీఓ2, డీసీపీ యంత్రాల పనితీరుపై అవగాహన పెంచుకుంటే, ప్రమాద సమయాల్లో వాటి వినియోగం ద్వారా ప్రమాద తీవ్రతను దూరం చేయవచ్చన్నారు. ఆస్పత్రి సిబ్బంది అగ్ని ప్రమాద నివారణ యంత్రాలను ఎలా ఉపయోగించాలో వారికి ప్రయోగాత్మకంగా వివరించారు. ఎల్ఎఫ్ ఎం.రాజబాబు, టి.అప్పన్న, టి.కామేష్, ఎం.శ్రీను, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు



బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై శాస్త్రి

మండపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండపేట పట్టణంలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. పట్టణ ఎస్సై హరికోటి శాస్త్రి ఆధ్వర్యంలో కార్లు, లారీలు, ద్విచక్ర వాహనాలతో పాటు, భారీ వాహనాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. మెయిన్ రోడ్డు, బస్టాండ్, పెద్ద కాలువ, బైపాస్ రోడ్డులో ఈ తనిఖీలు జరిగాయి. మద్యం, డబ్బు వంటివి రవాణా అవుతున్నాయా అనే కోణంలో పోలీసులు నిశితంగా పరిశీలించారు.

యువతి అదృశ్యం



చాందిని(ఫైల్)

రామచంద్రపురం: పట్టణంలోని పోతులవారి వీధికి చెందిన యువతి ఈ నెల పదో తేదీ నుంచి కనిపించడం లేదని రామచంద్రపురం ఎస్సై కె.సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. పోతులవారి వీధికి చెందిన తాళాబత్తుల వెంకటరమణ కుమార్తె చాందిని మధు రాఘవదేవి అలియాస్ చాందిని పదో తేదీ ఉదయం నుంచి కనిపించటం లేదన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు తన సెల్ 94407 96589, రామచంద్రపురం పోలీస్‌స్టేషన్ 08857-24233 నంబర్లకు తెలియజేయాలని ఎస్సై కోరారు.